సాక్షి విశాఖపట్నం

శనివారం । 31 । ఆగస్టు । 2024



కేజీహెచ్‌లో అరుదైన చికిత్స

కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు వైద్యులకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

8లో



ప్రసాదాల నాణ్యతలో రాజీ వద్దు

ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉద్యోగులను ఆదేశించారు.

8లో



ఇండోనేషియాకు శివాలిక్

ఐఎన్ఎస్ శివాలిక్ నౌక ఇండోనేషియాలోని సుబరియా పోర్టుకు శుక్రవారం చేరుకుంది. నావికా బృందానికి స్వాగతం పలికారు.

8లో

న్యూస్‌రీల్

శ్రావణ్ షిప్పింగ్‌లో ప్రమాదం







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: గాజువాక శ్రావణ్ షిప్పింగ్ కంపెనీలో శుక్రవారం రాత్రి ప్రమాదం సంభవించింది. కంటైనర్ నుంచి లారీలోకి రసాయనిక పౌడర్‌ను లోడింగ్ చేస్తున్న సమయంలో విష వాయువులు వెలువడ్డాయి. దాన్ని పీల్చిన అయిదుగురు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని అక్కడున్న వారు గాజువాకలోని సింహాద్రి ఆస్పత్రికి తరలించారు. నలుగురి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉండగా.. ఒకరి పరిస్థితి మాత్రం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులను సీపీ శంఖబ్రత బాగ్చి ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.

ఎస్పీగా ప్రసాద్‌కు పదోన్నతి

విశాఖ సిటీ: ఎస్పీగా పదోన్నతి లభించిన కేవీఆర్‌కే ప్రసాద్‌కు విశాఖ ట్రాన్స్‌కోలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అదనపు ఎస్పీగా ఉన్న ప్రసాద్‌కు ఎస్పీ(నాన్ కేడర్)గా పదోన్నతి లభించింది. అలాగే ఎడీఎస్పీగా ఉన్నచోటే ఎస్పీగా నియమించారు. అలాగే పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఆర్.వర్మకు కూడా పదోన్నతిపై మెరైన్ ఎస్పీగా నియమితులయ్యారు.

ముగ్గురు డీఎస్పీలకు...

నగరంలో ముగ్గురు డీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి లభించింది. అలాగే వీరిలో ఇద్దరికి నగరంలోనే పోస్టింగ్ ఇవ్వగా.. ఒకరిని మాత్రం హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు చేశారు. సీఐడీలో డీఎస్పీగా ఉన్న ఎం.మోహనరావుకు ఏడీఎస్పీగా పదోన్నతి కల్పించడంతో పాటు విశాఖ క్రైమ్ ఏడీసీపీగా నియమించారు. అలాగే సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కె.ప్రభాకర్ పదోన్నతిపై ఇక్కడే సీఎస్‌బీ ఏడీసీపీగా నియమితులయ్యారు. అదే విధంగా ఇటీవల జరిగిన బదిలీల్లో డీఎస్ఆర్‌పీగా పోస్టింగ్ లభించిన ఎ.త్రినాథరావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

నేడు మహిళా న్యాయవాదుల సదస్సు

విశాఖ లీగల్ : నూతనంగా ఏర్పాటైన విశాఖ మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సు శనివారం ఉదయం నగరంలోని వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉపాధ్యక్షులు సీనియర్ న్యాయవాది కేడీఎల్ నాగశ్రీ తెలిపారు. సదస్సును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవి చీమలపాటి, జస్టిస్ రవి తెలహరి ప్రారంభిస్తారు. ఈ సదస్సులో మహిళా న్యాయవాదులు, మహిళలు పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు అంశంపై పలువురు వక్తలు ప్రసంగిస్తారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా ప్రియదర్శిని, రాష్ట్ర వినియోగదారుల మండలి అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్, జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షుడు, ఇతర మహిళా న్యాయవాదులు న్యాయమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు నాగశ్రీ వివరించారు.





వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం.. లక్ష్మీదేవి నామస్మరణతో పలు ఆలయాలు మార్మోగాయి. కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారిని విశేషంగా అలంకరించి.. వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య క్షీరాభిషేక సేవ నిర్వహించారు. అలాగే సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు కనులపండువగా జరిగాయి. మూడు వేల మంది మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

8లో

విశాఖ చేరుకున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. కమిటీ చైర్మన్ సుజీత్ కుమార్, సుమిత్ర బల్మిక్, రాజేంద్ర గెల్హత్ తదితర సభ్యులు విశాఖ వచ్చారు. విశాఖలో వీరంతా రెండు రోజుల పాటు పర్యటిస్తారు. వీరిని ఆర్‌డీవో హుస్సేన్‌సాహెబ్, స్టీల్ ప్లాంట్ జీఎం సుబోద్ కుమార్ గుప్త, పోర్టు ట్రస్ట్ సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు స్వాగతం పలికారు.

ఇసుక నుంచి.. ఇంధనం వరకు..

- ప్రతి వస్తువు నాణ్యతా పరిశీలించేలా..
- ఎక్స్‌ఆర్‌డీ ఎనలైటికల్ ల్యాబ్ ప్రారంభించిన పెట్రోలియం యూనివర్సిటీ
- ప్రతి మెటీరియల్ గుర్తింపు, నాణ్యతకు సహాయకారిగా ల్యాబ్
- వస్తువు ఎలా ఏర్పడింది? దేనికి ఉపయోగించవచ్చనే అంశాలూ తెలిపేలా రిపోర్ట్
- ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో రూ.3.94 కోట్లతో ఏర్పాటు
- ఏపీలో ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ ఏర్పాటు చేసిన తొలి ఇన్‌స్టిట్యూట్‌గా ఐఐపీఈ



ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎస్‌బీఐఎఫ్ ఎండీ సంజయ్ ప్రకాష్, ఐఐపీఐ డైరెక్టర్ ప్రొ.శాలివాహన్

సాక్షి, విశాఖపట్నం : ఇసుక రేణువు చిన్నదే.. దాని నాణ్యత తెలుసుకోవాలంటే చాలా కష్టం.? అది ఎలా ఏర్పడిందో కనుగొనాలంటే మరింత పరిశోధనలు చెయ్యాల్సిందే. కానీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో ఏర్పాటు చేసిన ఎక్స్‌ఆర్‌డీ ఎనలైటికల్ ల్యాబ్ ద్వారా చాలా సులువు. ఇసుక నుంచి ఇంధనం వరకూ ప్రతి వస్తువు నాణ్యత, పూర్వాపరాలు తెలుసుకునేందుకు రాష్ట్రంలోనే తొలి ల్యాబ్ సేవలు ఇక్కడ మొదలయ్యాయి.

ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ అంటే.. ఎక్స్‌రే డీ ఫ్రాక్టోమీటర్ ఎనలైటికల్ ల్యాబ్. ఇది స్ఫటిక పదార్థాల భౌతిక లక్షణాలు, వాటి నిర్మాణం, దిశ దశ, కూర్పును అధ్యయనం చేసేందుకు సులువైన ల్యాబ్. ఎక్స్–కిరణాలను ఉపయోగించే నాన్–డిస్ట్రక్టివ్ ఎనలిటికల్ టెక్నిక్‌తో ప్రతి వస్తువు తాలుక వివరాలను నివేదిక రూపంలో వెల్లడిస్తుంది. సోలార్, హైడ్రోజన్ ఎనర్జీ మెటీరియల్స్ ఉత్పత్తి, రవాణా, స్టోరేజీకి ఈ పరిశోధనా కేంద్రం కీలకం కానుంది. కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) రంగంలో పరిశోధనలో కూడా ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ ముఖ్య భూమిక పోషించనుంది.

ఏం చేస్తారంటే.??

ఉదాహరణకు ఎర్రమట్టి దిబ్బలు ఇసుకతో తయారయ్యాయని అందరికీ తెలుసు. కానీ ఇసుక ఎందుకు ఎర్రగా మారింది.? బీచ్‌లో ఉండే ఇసుకకు, ఎర్ర మట్టి దిబ్బల ఇసుకకు ఉన్న వ్యత్యాసమేంటి.? ఏ మెటీరియల్ ద్వారా ఇలా మారింది.. ఇలా ప్రతి విషయాన్ని విపులంగా ఈ ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రపంచంలో దొరికే ఏ మెటీరియల్ అయినా.. అది పౌడర్, ఇసుక, కెమికల్స్.. థిన్ ఫిల్మ్, హై టెంపరేచర్.. ఏ రూపంలో ఉన్నా దాని వివరాల్ని ఈ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చు. క్వార్ట్ రాయిని టెస్ట్ చేసి దాని క్రిస్టల్ స్ట్రక్చర్ ద్వారా ఏ రాయి దేనికి ఉపయోగపడుతుందనేది ఈ ల్యాబ్ రిపోర్ట్స్ స్పష్టం చేస్తాయి.

అన్ని రంగాలకు ఉపయోగపడేలా..

ఇది కేవలం ఇంధన రంగంలో పరిశోధనలకు మాత్రమే కాకుండా అన్ని సెక్టార్లకు సంబంధించిన పరిశోధనల ఫలితాలను అందించగలదు. జియాలజీ, ఫార్మాస్యుటికల్స్.. ఇలా భిన్నమైన రంగాల్లో వినియోగించే మెటీరియల్ వివరాల్ని అందించే అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రసాయనాల టెస్టింగ్‌కు అత్యంత కీలకంగా పని చేస్తుంది. కెమికల్ ఎలా ఏర్పడిందో తెలుసుకొని దానిలో ఏ తరహా కెమికల్ కలపొచ్చు.. దాని ద్వారా ప్రమాదాలు తలెత్తవనే వివరాల్ని సేకరించడం ఈ ల్యాబ్ ద్వారా సులువవుతుంది. వస్తువుల క్వాలిటీ కంట్రోల్ ఎనాలసిస్‌లో ఎక్స్ ఆర్‌డీ ల్యాబ్ రాష్ట్రంలోనే కీలకంగా మారనుంది.



టోటల్ ఆర్గానిక్ కార్బన్ అనలైజర్

ఈ టీవోసీ ద్వారా 720 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఆర్గానిక్ కార్బన్‌ని సీవో2గా మార్చగలదు. ఈ యంత్రం ద్వారా తాగునీటిలో ఉన్న కలుషితాల్ని కనుగొనవచ్చు. సెమికండక్టర్ల తయారీలో వాడే నీటివివరాల్ని కనుక్కోవచ్చు.



ఎస్ఎస్ఎంతో..

ఘన పదార్థాల రూపంలో ఉన్న వస్తువుల వివరాల్ని శోధించేందుకు ఎస్ఎస్ఎం మిషన్ ఉపయోగపడుతుంది. 30 నుంచి 40 నిమిషాల్లో 900 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకునే వ్యవస్థ ఇందులో ఉంటుంది.

ఎక్స్‌రే డిఫ్రాక్షన్ మెషీన్‌తో..



ఈ మెషీన్‌లో ఏ పదార్థం తాలుక నిర్మాణం, వ్యవస్థను కనుక్కోవాలో దాన్ని ఇందులో ఉంచుతారు. మెషీన్‌లో వెలువడే ఎక్స్ కిరణాల సాయంతో పదార్థానికి సంబంధించిన పూర్తి సమాచారం డిస్‌ప్లే అవుతుంది.

ఏపీలో తొలి యూనివర్సిటీగా..

ఎస్‌బీఐ ఫౌండేషన్ అందించిన రూ.3.94 కోట్ల సీఎస్సార్ నిధులతో ఐఐపీఈలో ఈ ల్యాబ్‌ని గురువారం ఎస్‌బీఐఎఫ్ ఎండీ సంజయ్ ప్రకాష్, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొ.శాలివాహన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొ.విజయ్‌కుమార్ తదితరులు కలిసి ప్రారంభించారు. దేశంలో కేవలం మూడు యూనివర్సిటీల్లో మాత్రమే ఈ ల్యాబ్ ఉండగా.. ఏపీలో తొలి యూనివర్సిటీగా ఐఐపీఈ చరిత్ర సృష్టించింది.

పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యత





మొక్కలు నాటుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్) మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖ సిటీ: మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆంధ్రాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనం–మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.ఎస్.శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మైదానంలో మొక్కలు నాటారు. రాష్ట్రంలో కోటి మొక్కలు నాటి రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సంకల్పించినట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 3 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సాధారణ పౌరులతో పాటు ఎన్‌జీవోలు, పారిశ్రామికవేత్తలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు అటవీ, డ్వామా, పంచాయతీ రాజ్, విద్యా శాఖ, పరిశ్రమల శాఖల ద్వారా మొక్కలు వేసి పెంచే బాధ్యతను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎం. శ్రీభరత్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత నాథరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జూ క్యూరేటర్ నందనీ సలారియా, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ, జిల్లా అటవీ శాఖాధికారి సీహెచ్.ధర్మరక్షిత్, అటవీ రేంజ్ అధికారి బి.రామ్‌నరేష్, 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీల కోసం ముగ్గురు ఎమ్మెల్యేల పట్టు

- నగరంలో తిష్టవేసిన ఇద్దరు ఏసీపీలు
- ఇక్కడి నుంచి కదలకుండా ముమ్మర ప్రయత్నాలు
- రంగంలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు
- విశాఖ పర్యటనలో లోకేష్‌తో 30 నిమిషాలపైగా చర్చ
- బదిలీ ఉత్తర్వులు వచ్చినా విశాఖలోనే అధికారి



విశాఖ సిటీ: ప్రభుత్వం ఏదైనా.. ఎమ్మెల్యే ఎవరైనా.. వారు మాత్రం విశాఖను విడిచిపెట్టరు. ఎవరు అధికారంలో ఉంటే వారికి బాకాలు ఊదడంలో ఘనాపాఠీలు. ఎంత మంది కమిషనర్లు మారినా.. ఎన్ని ఆరోపణలు వచ్చినా.. వారిని కదల్చలేరు. ఇక్కడి నుంచి పంపించలేరు. ఆ ఇద్దరు ఏసీపీలు.. తాజా బదిలీల్లో కూడా విశాఖ నుంచి వెళ్లకుండా ఉండేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఇద్దరు ఏసీపీల కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి ఏకంగా చినబాబు లోకేష్‌పైనే ఒత్తిడి తీసుకువచ్చినట్లు పోలీస్ శాఖలో జోరుగా చర్చ జరుగుతోంది.

విశాఖలో పోస్టింగ్ కోసం..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బదిలీల జాతరకు తెరలేపింది. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేశారన్న నెపంతో అన్ని శాఖల మాదిరిగానే పోలీస్ శాఖలో కూడా అనేక మంది అధికారులపై బదిలీ వేటు వేసింది. ఇప్పటికే డీసీపీలు, ఏడీసీపీలను ఇక్కడి నుంచి పంపించేసి.. వారిలో కొంత మందికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా గాల్లో ఉంచింది. అలాగే ఇటీవలే ముగ్గురు ఏసీపీలను బదిలీ చేసి ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. కానీ వారి స్థానాల్లో కొత్తగా ఎవరినీ నియమించలేదు. దీంతో అనేక మంది ఏసీపీలు విశాఖకు వచ్చేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఏసీపీలు మళ్లీ నగరానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇద్దరి కోసం ముగ్గురు పట్టు

నగరంలో ఇద్దరు ఏసీపీల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ఆ ఇద్దరి కోసం ఏకంగా ముగ్గురు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఉన్నతాధికారుల పోస్టింగ్‌లను ప్రత్యక్షంగా చినబాబే పర్యవేక్షిస్తున్నట్లు పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది. సీఐ ఆ కింది స్థాయి అధికారుల విషయంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్ద పీట వేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అయితే నగరంలో ఇద్దరు ఏసీపీల విషయంలో మాత్రం ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ముగ్గురు ఏసీపీలపై బదిలీ వేటు పడితే ఇద్దరు ఇప్పటికే రిలీవ్ అయిపోయారు. కానీ ఒక ఏసీపీకి మాత్రం ఇంకా ఇక్కడే విధులు నిర్వర్తిస్తుండడంతో ఈ వాదనలకు బలాన్నిస్తున్నాయి. ఈ ఏసీపీల విషయంలో ఏకంగా చినబాబుపైనే ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాలు చేశారన్న టాక్ నడుస్తోంది. రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ మంత్రి నారా లోకేష్ రెండు రోజుల పర్యటన కోసం ఈ నెల 28న విశాఖకు వచ్చారు. 29వ తేదీ సాయంత్రం ముగ్గురు ఎమ్మెల్యే సుమారుగా 30 నిమిషాల పాటు ఇద్దరు ఏసీపీల కోసం చినబాబుతో చర్చించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరిని విశాఖ నుంచి కదల్చకూడదని చినబాబుపై ఒత్తిడి తీసుకు వచ్చినట్లు పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఈ ఇద్దరు ఏసీపీలను ఇక్కడి నుంచి కదల్చకుండా ఉండేందుకు ఒక పారిశ్రామికవేత్త తెరవెనుక ఆర్థిక సాయం అందించినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. అతడు అందించిన డబ్బుతో ఒక ఎమ్మెల్యే పీఏ ద్వారా చేతులు మారినట్లు చర్చ జరుగుతోంది. అయితే వీరి ప్రయత్నాలు ఎంత మేర సఫలీకృతమవుతాయన్నది త్వరలో జరగనున్న బదిలీల్లో తేలిపోనుంది.

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా రమేష్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా కె.రమేష్ నియమితులయ్యారు. ఈయన ఇప్పటి వరకు ఏపీసీఆర్‌డీఏలో జాయింట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ జాయింట్ కమిషనర్‌గా ఉన్న వి.రవీంద్రను విశాఖలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రీజినల్ డైరెక్టర్–కమ్–అపిలేట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. వీరితో పాటు జీవీఎంసీలో కూడా అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు స్థానచలనం కలిగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న పి.ప్రేమ ప్రసన్నవాణిని జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ జోనల్ కమిషనర్‌గా ఉన్న కె.కనకమహాలక్ష్మిని విజయవాడలోని డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పి.సింహాచలంను జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ జెడ్సీగా జి.శైలజావల్లిని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న కె.శివప్రసాద్‌ను జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా వేశారు. ఇక్కడ డిప్యూటేషన్ జెడ్సీగా ఉన్న జె.విజయలక్ష్మిని మాతృసంస్థకు పంపించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ నుంచి పి.వి.వి.డి.ప్రసాదరావును బదిలీ చేశారు. అదే విధంగా రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న బి.ఆర్.ఎస్.శేషాద్రిని జీవీఎంసీ జెడ్సీగా వేశారు. ఇక్కడ డిప్యూటేషన్‌పై జెడ్సీగా విధులు నిర్వర్తిస్తున్న బి.సన్యాసినాయుడును మాతృసంస్థకు పంపించారు.

వేధింపుల్లో భాగంగానే..

జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు బదిలీ వ్యవహారం చర్చకు దారితీస్తోంది. ఆయన స్థానంలో జీవీడబ్ల్యూవీ అండ్ వీఎస్‌డబ్ల్యూఎస్ అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణను ప్రభుత్వం నియమించింది. వాస్తవానికి శ్రీనివాసరావుకు జీవీఎంసీ మాతృసంస్థ కావడంతో బదిలీ చేసినా.. ఇక్కడే ఇతర విభాగాల్లో పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆయనను ఇక్కడ నుంచి అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే శ్రీనివాసరావును నిబంధనలకు విరుద్ధంగా బదిలీ వేటు వేసిందన్న వాదన వినిపిస్తోంది.

చీటీలతో చీటింగ్

- కేబుల్ మూర్తి అనుచరుడి చేతివాటం
- 500 మంది వద్ద రూ.30 కోట్లు వసూలు
- చీటీ చెల్లించే సమయంలో పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

అక్కిరెడ్డిపాలెం : పరిచయాలు పెంచుకుని చిన్నచిన్న చీటీల వ్యాపారం ప్రారంభించాడు. గతంలో అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా పనిచేసిన అనుభవం..టీడీపీ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి) ముఖ్య అనుచరుడిగా కొనసాగుతూ తన వ్యాపారాన్ని విస్తరించాడు. లక్షలతో చీటీల వ్యాపారం ప్రారంభించిన ఆయన అనతికాలంలో కోట్లకు పడగలెత్తాడు. కట్ చేస్తే..రూ.30 కోట్ల చీటీ డబ్బులతో పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక వాంబేకాలనీకి చెందిన మరడాన పరశురాం సుమారు 12 ఏళ్ల క్రితం అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా జీవితాన్ని ప్రారంభించారు. పరిచయాలను ఆసరాగా చేసుకుని చిన్నచిన్న చీటీల వ్యాపారం ప్రారంభించాడు. రూ.5, 10, 15, 20, 25 లక్షల చీటీల వరకు తీసుకువెళ్లాడు. ప్రారంభంలో సక్రమంగా చీటీ డబ్బులు చెల్లించాడు. దీంతో చాలా మందికి నమ్మకం కలిగింది. దీనిని ఆసరాగా చేసుకుని చీటీల పేరుతో వచ్చిన డబ్బును ఇతర సంస్థలకు మళ్లించాడు.

పరుశురాంతో పాటు భార్య కుమారి, అన్నయ్య సత్తిబాబు, వదిన జ్యోతి, మేనల్లుడు ధనుంజయ్, అక్క చంద్ర, మామయ్యలు చీటీల నిర్వహణలో పాలు పంచుకోవడంతో పాటు పప్పులు చీటీలు, వరలక్ష్మీ వ్రతం కార్డులు, కిరాణా లక్కీ డ్రాలు నిర్వహించేవారు. చివరకు ఆఖరి చీటీలు రూ.25, రూ.20, రూ.15 లక్షల చెల్లించే సమయంలో పరారయ్యారు. బాధితులు ఒక్కొక్కరు లక్షల్లో మోసపోయామని లబోదిబోమంటున్నారు. పరశురాం చేతిలో మోసపోయిన వారిలో వాంబే కాలనీ, ప్రియదర్శిని కాలనీ, బాపూజీనగర్, సంజీవ్‌గిరి కాలనీ, వికాస్ నగర్, అశోక్‌నగర్, నేతాజీ కాలనీ, ఆటోనగర్, గాజువాకతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు.

కేబుల్ మూర్తి ముఖ్య అనుచరుడిగా..

65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి)కి ముఖ్య అనుచరుడు పరుశురాం. కేబుల్ మూర్తికి చీడికాడ, చోడవరంలో కల్కి ప్రమోటర్స్, సుందర వనం అనే వెంచర్స్ ఉన్నాయి. దీని ప్రధాన కార్యాలయం గాజువాక 60 అడుగుల రోడ్డులో ఉంది.

కేబుల్ మూర్తి నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలో పరశురాం పెట్టుబడులు పెట్టాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదే సంస్థలో జనరల్ మేనేజర్లుగా పరశురాం, సత్తిబాబు పనిచేసేవారన్నారు. ఇదిలావుండగా బాధితుల్లో కొందరు కేబుల్ మూర్తిని నిలదీశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు బాధితులు తెలిపారు. శనివారం కేసు నమోదు చేయనున్నట్లు ఏసీపీ టి.త్రినాథ్ చెప్పారు.

కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు అరుదైన చికిత్స

మహారాణిపేట: కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలిక ఎండోక్రైనాలజీ విభాగంలో చికిత్స పొందుతోంది. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపిన వివరాలివీ.. అల్లూరి జిల్లా కొయ్యూరు ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలిక ఒక్కసారిగా బరువు పెరగడం, ఆయాసం, అధిక ఆకలి, దాహం, అతి మూత్రం, తలపై జుట్టు రాలటం, మిగతా శరీర భాగాల్లో అధికంగా జుట్టు పెరగడం, ముఖం వాపు తదితర లక్షణాలతో బాధపడుతోంది. ఈ నెల 3న బాలికను ఆమె తల్లిదండ్రులు కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. పిల్లల సర్జరీ వార్డులో ఆమెను చేర్పించి.. ఆ విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో చికిత్స అందించారు. బాలికకు అధిక రక్తపోటు, వీపు పైభాగాల్లో అధికంగా కొవ్వు చేరడం, చర్మం మీద మచ్చలు, ముఖం ఉబ్బి ఉండడం వంటి లక్షణాలను గుర్తించి 'కుషింగ్స్ సింట్రోమ్'గా నిర్ధారించారు. బాలికకు రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి.. ఎడమ మూత్రపిండం పైభాగంలోని అడ్రినల్ గ్రంథిలో 3X3 సెంటీమీటర్ల పరిమాణంలో కణితి ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో బాలిక మెదడులోని నాళాల్లో రక్తం గడ్డ కట్టి, ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడంతో పలు విభాగాల వైద్యులు వెంటిలేటర్‌పై ఆమెకు చికిత్స అందించారు. ఈ క్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న లాప్రోస్కాపిక్ శస్త్ర చికిత్స విధానం ద్వారా కణితి తొలగించారు. శస్త్ర చిక్సిత అనంతరం బాలిక ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడింది. రక్తపోటు సాధారణ స్థితికి చేరింది. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ శుక్రవారం బాలికను పరామర్శించి.. ఆమెకు చికిత్స అందించిన వైద్యులు కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కరరెడ్డి, హసంతి, కల్యాణ్, శ్రీనివాస్, ప్రవీణ్, నాగరాజు, జూనియర్ వైద్యులను అభినందించారు.

ఇండోనేషియా చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్

సింథియా: దక్షిణ చైనా సముద్రం, పసిఫిక్ మహా సముద్రంలో కొనసాగుతున్న కార్యాచరణ విస్తరణలో భాగంగా ఐఎన్ఎస్ శివాలిక్ నౌక ఇండోనేషియాలోని సుబరియా పోర్టుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇండోనేషియా నావికాదళం అధికారులు, సైనిక బృందం భారత నేవీ బృందానికి ఘన స్వాగతం పలికాయి. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని నేవీ వర్గాలు తెలిపాయి. ఇండోనేషియా నావికాదళంతో ప్రొఫెషనల్ ఇంటరాక్షన్లు, క్రాస్ డెక్ విజిట్లు, క్రీడా పోటీలు, సేవా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

వరలక్ష్మీ నమోస్తుతే..

మహాలక్ష్మికి వస్త్రార్చన



మహాలక్ష్మి అమ్మవారికి సమర్పించిన 108 చీరలు

కొమ్మాది: అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్ట లక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం 4వ శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. వేకువ జామున సుప్రభాత సేవ అనంతరం శ్రీ అష్ట లక్ష్మీ హోమం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణులను వజ్రకవచధారణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి 108 పట్టు చీరలను సమర్పించి వస్త్రార్చన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వర్ణ వస్త్రాలంకరణలో.. కన్యకాపరమేశ్వరి



దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారు స్వర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మ 350 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు(ఇన్‌సెట్) అమ్మవారు



నృసింహ మండపంలో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



పూజలందుకుంటున్న లక్ష్మీదేవి



పూజలు నిర్వహిస్తున్న వైదికులు

- సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం: శ్రావణ శుక్రవారం.. లక్ష్మీదేవి నామస్మరణతో సింహగిరి మార్మోగింది. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు కనులపండువగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి సింహగిరిపై ఉన్న యాత్రిక సదన్, మాడవీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడు వేల మంది మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశారాధన, అష్టోత్తర కుంకుమ పూజలను విశేషంగా నిర్వహించారు. మహిళలందించేత లక్ష్మీదేవి నామాలను పఠింపజేస్తూ అర్చకులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపజేశారు. అనంతరం శ్రావణ మంగళ గౌరీదేవి వ్రత కథను చదివి వినిపించారు. పూజలో పాల్గొన్న మహిళలందరికీ దేవస్థానం ఉచితంగా పూజా సామగ్రి, ప్రసాదం, రవికెలు అందజేసింది. ఉచితంగా దేవస్థానం బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పించింది. స్వామి వారి దర్శనాన్ని ఉచితంగా అందజేసింది. అన్న ప్రసాద భవనంలో భోజనం అందించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు, వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రావణ లక్ష్మి..సౌభాగ్య ప్రదాయిని





శ్రావణ లక్ష్మి పూజల్లో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారు స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారిని విశేషంగా అలంకరించి.. వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రావణలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన వారి పేరిట వేద పండితులు అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. ఉదయం 8.10 గంటలకు మొదటి బ్యాచ్, 9.30 గంటలకు రెండవ బ్యాచ్ పూజలో పాల్గొన్న మహిళల్లో ఇద్దరు పేర్లను డ్రా తీసి.. వారికి శ్రీలక్ష్మీదేవి వెండి ప్రతిమలు బహూకరించారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

'ఎగుమతి వ్యాపారం'పై ఆన్‌లైన్ ప్రోగ్రాం

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి' అనే అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్సీ కార్యదర్శి పి.వైదేహి తెలిపారు. సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్‌సైట్ ఆధారిత సెషన్స్ ఉంటాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం 9391422821 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మంత్రా.. మజాకా

- చంద్రంపాలెం హైస్కూల్‌ను సందర్శించిన మంత్రి లోకేష్
- బురదతో ఉన్న మైదానాన్ని గంటలో సిద్ధం చేసిన అధికారులు
- రెండు నెలలుగా జీతాల్లేవని కార్మికుల ఆవేదన



చంద్రంపాలెం హైస్కూల్ మైదానంలో బురదపై వేస్తున్న ఫ్లైయాష్

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైంది. ఇంకా చెప్పాలంటే దమ్ము చేసిన పొలంలా మారింది. బురదలోనే 3,411 మంది విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు.. మంత్రి నారా లోకేష్ కోసం ఆగమేఘాల మీద చర్యలు చేపట్టారు. లారీలపై ఫ్లైయాష్ తీసుకొచ్చి గుంతలు పూడ్చారు. ఇసుక, మట్టి వేసి మంత్రి కారు వెళ్లేందుకు వీలుగా గంటలోనే ఏర్పాట్లు చేశారు. బడిబాటలో భాగంగా శుక్రవారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చంద్రంపాలెం హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు పరిశీలించారు. తర్వాత ఆయన తరగతి గదిలోకి వెళ్లగానే అధికారులు తలుపులు వేసేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావును సెక్యూరిటీ అనుతించకపోగా.. సార్‌కి కుర్చీ తేవాలంటూ ఎగతాళిగా మాట్లాడారు. కాగా.. విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మైదానంలో వర్షం నీరు నిలిచిపోయి అధ్వానంగా మారుతోందని, రోడ్డు దాటడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, టాయిలెట్లకు నీటి సరఫరా సరిగా లేదని, తలుపులు కూడా సక్రమంగా లేవని మంత్రికి చెప్పారు. మీటింగ్ హాలు, పెద్ద లైబ్రరీ అవసరం ఉందని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రోగ్రామింగ్ ఎవ్వరైనా నేర్చుకున్నారా? బైజూస్ కంటెంట్ ఎలా ఉంది? టీవీలు పని చేస్తున్నాయా? ఉపాధ్యాయులు బాగా పాఠాలు బోధిస్తున్నారా? స్కూలు బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, బూట్ల నాణ్యత ఎలా ఉందని మంత్రి లోకేష్ ప్రశ్నించగా బాగున్నాయని విద్యార్థులు సమాధానమిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తల్లిదండ్రులు నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ బాగా చదవడం, తరగతి గది గోడలపై మెటీరియల్ ఎవరు తయారు చేశారని అడగ్గా.. తామే తయారు చేశామని విద్యార్థులు చెప్పారు. ఈ సందర్భంగా తమకు రెండు నెలలుగా జీతాలు లేవని పాఠశాల పారిశుధ్య కార్మికులు మంత్రి వద్ద మొరపెట్టుకున్నారు. వలంటీర్‌లు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరేందుకు ప్రయత్నించగా.. అనుమతించలేదు. ఎంపీ భరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, డీఈవో చంద్రకళ, ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

340 కిలోల గంజాయి స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం చందక, పొడుగుపాలెం గ్రామాల మధ్య పోలీసుల తనిఖీల్లో 340 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుందని అంచనా. వివరాలివీ.. చందక, పొడుగుపాలెం మధ్య శుక్రవారం వేకువజామున 3.30 గంటల సమయంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు ఆటోలు, ఒక ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 340 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 170 ప్యాకెట్లుగా గంజాయి తరలిస్తున్న వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్టు తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వీరిలో ఇద్దరిది ఒడిశాలోని మల్కన్‌గిరి. మిగిలిన నలుగురిది పాడేరు. వీరిని అదుపులోకి తీసుకుని గంజాయి, వాహనాలను సీజ్ చేశారు.

రెండేళ్లుగా గంజాయి సరఫరా: స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చందక పంచాయతీలో రహదారి పక్కన వ్యవసాయ భూమిలో నిర్మించిన షెడ్డులో పాడేరు, ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. నగరానికి చెందిన వ్యక్తులు తరచూ కార్లలో ఈ షెడ్డు దగ్గరకు వచ్చి గంజాయి పార్సిళ్లు పట్టుకుని వెళ్తుంటారని తెలిసింది. రెండేళ్లుగా ఈ తంతు జరుగుతోంది. అయితే ఉదయం నుంచి జరిగిన హైడ్రామా ప్రకారం తనిఖీల్లో భాగంగా వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు అధికారులు చెప్పడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యప్ప భక్తులకు శుభవార్త

- విశాఖ-కొల్లాం మధ్య వీక్లీ స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి గురువారం మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 4 నుంచి నవంబరు 27వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు కొల్లాంలో బయలుదేరి శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 5 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు నడుస్తుంది. ఈ అవకాశాన్ని అయ్యప్ప మాలధారులు వినియోగించుకోవాలని డీసీఎం కోరారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ◆ విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ (08557) పూజా స్పెషల్ శనివారాల్లో రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 7 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నడుస్తుంది. చెన్నై ఎగ్మోర్-విశాఖపట్నం (08558) పూజా స్పెషల్ ఆదివారాల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 8 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నడుస్తుంది. ◆ విశాఖపట్నం- సికింద్రాబాద్(08579) వీక్లీ స్పెషల్ విశాఖలో బుధవారాల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్‌ను నవంబర్ 27 వరకు పొడిగించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం (08580) వీక్లీ స్పెషల్ సికింద్రాబాద్‌లో గురువారాల్లో రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ నవంబరు 28 వరకు పొడిగించారు. ◆ విశాఖపట్నం-తిరుపతి(08583)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 25 వరకు పొడిగించారు. తిరుపతి-విశాఖపట్నం(08584) స్పెషల్ తిరుపతిలో మంగళవారాల్లో రాత్రి 9.55గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబరు 26 వరకు పొడిగించారు.

ఉద్యోగాల పేరిట గృహిణులకు టోకరా

మర్రిపాలెం: హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఎంఅండ్‌డబ్ల్యూ(హ్యూమన్ యూనిక్ గోల్స్) అనే సంస్థ పేరిట జీవనోపాధి కల్పిస్తానని గృహిణులు, మహిళలను మోసం చేశాడు. దీంతో బాధితులు శుక్రవారం ఐదో పట్టణ పోలీసులకు ఆయనపై ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. హైదరాబాద్‌కు చెందిన మాచర్ల జగన్నాథం గౌడ అనే వ్యక్తి రామా టాకీస్ ప్రాంతంలోని ఉంటూ.. రెడ్డి కంచరపాలెంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని గృహిణులు, మహిళలను టార్గెట్ చేశాడు. తనకి చాలా వ్యాపారాలు ఉన్నాయని.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. సుమారు 350 మహిళల నుంచి రూ.1,300 చొప్పున సేకరించాడు. మహిళలను వారి అర్హతను బట్టి మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, తదితర విభాగాల్లో చేర్పించుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. కొన్ని రోజులు ఎవరికి అనుమానం రాకుండా సంస్థను నడిపాడు. తర్వాత ఇంటి యజమానికి అద్దె చెల్లించి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించాడు. ఇదంతా జూలైలో జరిగింది. ఆ తర్వాత అతని గురించి వాకబు చేసిన మహిళలు, గృహిణులు.. తమను మోసం చేశాడని గ్రహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దు

- సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: భక్తులు హుండీల్లో నగదు వేస్తేనే మనకు జీతాలు వస్తాయని.. ఆ విషయాన్ని గుర్తెరిగి.. వారు సంతృప్తి చెందేలా సేవలందించాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉద్యోగులను ఆదేశించారు. ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దని ఆ విభాగం అధికారులు, సిబ్బంది, శ్రీవైష్ణవ స్వాములకు స్పష్టం చేశారు. సింహగిరిపై ప్రసాదాల విక్రయ కేంద్రంలో శుక్రవారం ఈవో తనిఖీలు చేపట్టారు. ప్రసాదాలు కొనుగోలు చేసిన భక్తులతో మాట్లాడారు. ప్రసాదాల నాణ్యత, రుచి పై ఆరా తీశారు. అనంతరం అన్నప్రసాద భవనం పైఅంతస్తులో తయారవుతున్న పులిహోరా, లడ్డూలను పరిశీలించి.. వాటి రుచి చేశారు. సింహాచలంలో పులిహోరా, లడ్డూల రుచి అద్భుతంగా ఉంటుందన్న భక్తుల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా.. తయారు చేయాలని శ్రీవైష్ణవ స్వాములకు సూచించారు. అనంతరం లడ్డూలు చుట్టే సిబ్బంది వద్దకు వెళ్లి బరువు సరిగ్గా తూచి.. చుడుతున్నారో లేదో పరిశీలించారు. ప్రసాదాల శాంపిల్స్‌ను నిత్యం రుచి చూడాలని.. బాగుంటేనే విక్రయించాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నప్రసాద భవనంలో ఆఖరి పంక్తిలో కూర్చొన్న భక్తుడి వరకు ఒకే నాణ్యతతో అన్న ప్రసాదం అందించాలన్నారు. అన్న ప్రసాదం విభాగం ఇన్‌చార్జి ఈవో పాలూరి నరసింగరావు ఆయన వెంట ఉన్నారు.

26 మంది సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 26 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో 12 మందిని రేంజ్‌కు సరెండర్ చేయగా మిగిలిన వారికి బదిలీ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐ జి.సంజీవరావు, ద్వారకా క్రైం సబ్ డివిజన్ సి.హెచ్.శ్రీనివాసరావు, ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్-1 ఎల్.రేవతమ్మ, ఈస్ట్ క్రైం సబ్ డివిజన్ ఎస్.ఆదాం, నార్త్ క్రైం సబ్ డివిజన్ జి.రాంబాబు, దువ్వాడ లా అండ్ ఆర్డర్ సీఐ వి.వి.సి.ఎం.ఎర్రంనాయుడు, కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ సీఐ ఎ.ప్రసాదరావు, ఎయిర్ పోర్ట్ లా అండ్ ఆర్డర్ సీఐ వి.చక్రధరరావు, సైబర్ క్రైం జోన్-2 సీఐ జి.శ్రీనివాసరావు, వుమెన్ పీఎస్ జోన్-1 సీఐ టి.కల్యాణి, సీఎస్‌బీ-1 ఎల్.భాస్కరరావులను విశాఖ రేంజ్‌కు సరెండ్ చేశారు. ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐగా శ్రీకాకుళం నుంచి సి.హెచ్.వెంకట్రావును, ఎంవీపీ లా అండ్ ఆర్డర్‌కు విజయనగరం డీసీఆర్‌బీ నుంచి జె.మురళీని, ద్వారకా క్రైం సబ్ డివిజన్‌కు మన్యం డీటీసీ నుంచి డి.బంగారుపాపను, ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్-1కు విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న మద్దు శ్రీనును నియమించారు. అలాగే విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్.రాజులనాయుడును ఈస్ట్ క్రైం సబ్‌డివిజన్‌లో, విజయనగరం పీటీసీ నుంచి బి.సత్యశివ ప్రకాష్‌ను నార్త్ క్రైం సబ్ డివిజన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. హార్బర్ లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఎ.దాశరథిని కంచరపాలెం ట్రాఫిక్‌కు, సిటీ వీఆర్-2లో ఉన్న గొల్లు అర్జునను సీఎస్‌బీ-4/ఎయిర్ పోర్ట్ ఇమిగ్రేషన్‌కు, టాస్క్‌ఫోర్స్ జోన్-1లో ఉన్న కె.మల్లేశ్వరరావును దువ్వాడ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న వై.కె.కిశోర్‌కుమార్‌ను ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌కు, మన్యం జిల్లా డీసీఆర్‌బీలో ఉన్న బొబ్బిలి ఎం.డి.ప్రసాద్‌ను సైబర్ క్రైం జోన్-2కు, శ్రీకాకుళం డీటీసీ నుంచి జి.నిర్మలను వుమెన్ పీఎస్ జోన్-1కు, రేంజ్‌లో ఉన్న పి.పైడయ్యను సీఎస్‌బీ-1కు పంపించారు.

ఎస్‌బీ ఏడీసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్

విశాఖ సిటీ: అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన కింజరాపు ప్రభాకర్ సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన పలు హోదాల్లో నగరంలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా విధులు నిర్వర్తించారు. తాజాగా విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఉన్న ప్రభాకర్‌కు అదనపు ఎస్పీగా ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో పాటు విశాఖలోనే స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా నియమించింది. దీంతో ఆయన శుక్రవారం చార్జ్ తీసుకున్నారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

